నిరుపయోగంగా జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాలు

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన వైనం
- పగిలిపోయిన ఫ్లాట్స్ కిటికీల అద్దాలు
- ఎక్కడ చూసినా మద్యం, బీరు బాటిల్స్
- ఇళ్లు లేని పారిశుద్ధ్య కార్మికులకు కేటాయించాలని వినతి



కబేళా రోడ్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం


భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర పాలక సంస్థ పరిధిలోని 45వ డివిజన్‌లో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం నిరుపయోగంగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2017లో విద్యాధరపురం కబేళా రోడ్‌లో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద 13 బ్లాకులు నిర్మించేందుకు అప్పటి నగరపాలక సంస్థ నిర్ణయించింది. అయితే 12 బ్లాకుల నిర్మాణానికే నిధులు మంజూరు కావడంతో ఆ మేరకు మాత్రమే నిర్మించి వదిలేశారు. మొత్తం 12 బ్లాకుల గృహ సముదాయంలో ఒక్కో బ్లాక్‌కు 32 ఫ్లాట్ల చొప్పున మొత్తం 384 ఫ్లాట్లు ఉన్నాయి. అప్పటి నుంచి వాటిని ఎవరికీ కేటాయించక పోవడంతో నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. దాంతో అక్కడికి గంజాయి, మద్యం బ్యాచ్ వచ్చి యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. చాలా ఫ్లాట్ల కిటికీల అద్దాలు పగులకొట్టేశారు. కొన్ని కిటికీ ఫ్రేములు (స్క్రూ టైప్) ఊడదీసి ఎత్తుకు పోయారు. ఎక్కడ చూసినా మద్యం, బీరు బాటిల్స్ కనిపిస్తున్నాయి. ఈ గృహ సముదాయానికి ఆనుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దూ) ఉండగా మధ్యలో గోడ లేకపోవడంతో కాలేజీ నిర్వాహకులే తాత్కాలికంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు.

ఎవరెవరు ఏఏ ఫ్లాట్స్‌ను వాడుకుంటున్నారు?

జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయంలోని ఫ్లాట్లన్నీ ఖాళీగా దర్శనమిస్తుండంతో కొన్ని ఫ్లాట్లను మున్సిపల్ కార్పొరేషన్ ఆక్రమించుకుని వాడుకోవడం గమనార్హం. ఎవరెవరు ఏఏ ఫ్లాట్స్‌ను వాడుకుంటున్నారో చూస్తే.. 9వ బ్లాకులోని ఎనిమిది ఫ్లాట్లలో 45వ డివిజన్‌కు సంబంధించి నాలుగు వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. రెండు ఫ్లాట్లను కలిపి 45వ డివిజన్ శానిటరీ ఆఫీస్‌గా వాడుకుంటున్నారు. పదవ బ్లాకులో 43వ డివిజన్‌కు సంబంధించి ఒక సచివాలయం (రెండు ఫ్లాట్లు) ఉంది. కేదారేశ్వరపేట వేర్ హౌస్ గోడౌన్ రోడ్‌లో పార్క్ ఏర్పాటు చేసేందుకు గాను ఆ ప్రాంతంలో ఉంటున్న 9 మంది పేదలకు ఫ్లాట్లను కేటాయించారు. ఇక 11, 12 బ్లాకుల్లో ఇద్దరు వ్యక్తులకు నాలుగు ఫ్లాట్లు కేటాయించారు. ఆరవ బ్లాకు గ్రౌండ్ ఫ్లోర్‌లో 45వ డివిజన్ శానిటరీ విభాగానికి సంబంధించి ట్రై సైకిళ్లు తదితర సామగ్రిని పెట్టుకుంటున్నారు. మొత్తం 384 ఫ్లాట్లలో 25 ఫ్లాట్లను మాత్రమే కొందరు ఏదో విధంగా వినియోగించుకుంటున్నారు.

మాకు కేటాయించమని కోరుతున్న పారిశుద్ధ్య కార్మికులు

పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలో నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పని చేస్తూ సొంత ఇళ్లు లేని తమకు జేఎన్ఎన్‌యూఆర్ఎం ఫ్లాట్లు కేటాయించి ఆదుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు. ఈ దిశగా నగరపాలక సంస్థ అధికారులు ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గట్టు వెనుక ప్రాంతంలో పని చేస్తున్న తాము ఎక్కడో దూరంగా అద్దె కొంపల్లో నివసిస్తూ వేకువ జామున విధుల్లోకి రావాలంటే ఖర్చుతో కూడిన పనే కాకుండా అవస్థలు కూడా పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ కాలంలోను, ఇటీవల సంభవించిన బుడమేరు వరదల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ఇళ్లకు కూడా వెళ్లకుండా పనిచేశామని, మానవతా దృక్పథంతో ఖాళీగా ఉన్న ఫ్లాట్స్ తమకు కేటాయించాలని వేడుకుంటున్నారు.



కిటికీల అద్దాలు పగిలిపోయిన ఫ్లాట్లు



బ్లాకుల వద్ద ఖాళీ మద్యం, బీరు బాటిల్స్



ఒక ఫ్లాట్‌లో సున్నం బస్తాలు భద్రపరుచుకున్న దృశ్యం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాలకు సంబంధించి పశ్చిమ నియోజకవర్గానికి అధ్యక్షులను ఆ పార్టీ నియమించింది. మున్సిపల్ విభాగానికి బూరా మల్లేశ్వరరెడ్డి, ఆర్‌టీఐ విభాగానికి బంకా తేజేష్ కుమార్, గ్రీవెన్స్ సెల్‌కు పానుగంటి వెంకట శివరామప్రసాద్, లీగల్ సెల్‌కు సరహరిశెట్టి జ్యోతి, డాక్టర్స్ విభాగానికి గుర్రం శాంతకుమారి, పబ్లిసిటీ విభాగానికి ఉండేల శ్రీనివాసరెడ్డి తదితరులను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది.

వీరాంజనేయ స్వామి వారి హుండీ కానుకల ఆదాయం రూ.2.87 లక్షలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట వాగు సెంటర్‌లో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా రూ.2.87 లక్షలను కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారని ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని మండపంలో లెక్కించారు. మొత్తం నాలుగు హుండీల ద్వారా రూ.2,87,482 నగదు లభించినట్లు ఈవో పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో దేవదాయ శాఖకు చెందిన సు.దీర్‌కుమార్, వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ, పరాశరం పవన్‌కుమార్, పలువురు సేవా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో తిరుపతికి చెందిన శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు నృత్యకారులు శుక్రవారం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాచార్య శరత్‌చంద్ర పర్యవేక్షణలో సుమారు 20 మంది కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలను ప్రదర్శించారు. అమ్మ వారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

బాటసారులకు మంచినీరు అందించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేసవిలో రోడ్లపై రాకపోకలు సాగించే బాటసారులకు అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ మంచినీరు అందించే ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన తన తల్లి శేషమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత వలన వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందన్నారు. ప్రయాణికులకు, చిరు వ్యాపారులకు, రిక్షా కార్మికులకు అందుబాటులో మంచినీటిని ఉంచాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం చక్కని కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కోశాధికారి సందీప్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.సురేష్‌బాబు, డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): వ్యాపార కూడళ్లు, వ్యాపార సంస్థల్లో అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అందరికీ అవగాహన ఉండాలని రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. నగర పాలక సంస్థ ఫైర్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాధరపురంలోని సితార ఫంక్షన్ హాల్, ఫ్రూట్ మార్కెట్‌లోని సాయి అమృత ఫ్రూట్స్, తాజ్ అండ్ కో, కేఆర్‌కే ఫ్రూట్స్, మొగల్రాజపురంలో శ్రీ శ్రీనివాస గ్రావిటీ జూనియర్ కాలేజీలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎలాంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్ ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

దుర్గమ్మకు దర్బార్ సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దర్బార్ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గత వారం రోజులుగా ఆలయంలో జరిగే విశేషాలు, పూజాది కార్యక్రమాలతో పాటు దేవస్థానానికి వచ్చిన ఆదాయ వ్యయాలను అమ్మవారికి వివరించారు. దర్బార్ సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

దుర్గగుడికి వీల్‌చైర్స్ అందజేసిన పీఎన్‌బీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే వృద్ధులు, వికలాంగులకు అవసరమైన వీల్‌చైర్స్‌ను పంజాబ్ నేషనల్ బ్యాంక్ అధికారులు శుక్రవారం అందజేశారు. శుక్రవారం సాయంత్రం మహా మండపం 7వ అంతస్తులోని డీఈవో రత్నరాజు చాంబర్ వద్ద బ్యాంక్ అధికారులు నాలుగు వీల్‌చైర్స్‌ను దేవస్థానానికి అందజేశారు.

వైద్య పరిశోధనలపై ముందుకెళ్తున్న ఎస్ఎంసీ

ధన్వంతరి విగ్రహావిష్కరణ సభలో ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా



వైద్య కళాశాల ఆవరణలో ధన్వంతరి విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల వైద్య పరిశోధనలలో ముందుకు వెళ్తుండటం అభినందనీయమని నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా అన్నారు. వైద్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధన్వంతరి విగ్రహాన్ని శుక్రవారం డాక్టర్ విజయ్ ఓజా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్య కళాశాల భవిష్యత్తులో మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరసింహం, అదనపు డీఎంఈ డాక్టర్ రఘునందన్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సత్యనారాయణ, ఏడీలు కె.విజయలక్ష్మి, శ్రీకాంత్, డాక్టర ఆర్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్ సందర్శన

నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ విజయ్ ఓజా ప్రభుత్వాస్పత్రిలోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఎంఆర్ఐ స్కాన్‌ను పరిశీలించారు. అనంతరం ఆ ఫ్లోర్‌లో ఉన్న ఓపీ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఐదవ అంతస్తుకు వెళ్లి ఆపరేషన్ థియేటర్స్‌ను పరిశీలించారు. ఆ థియేటర్స్‌లో అందుబాటులో ఉన్న పరికరాలు, నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య కళాశాలకు చేరుకుని ఏసీ లెక్చర్ హాలులో టీచింగ్ వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వివరణ ఇచ్చారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసిన ఎస్ఎన్‌పురం పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నార్త్‌జోన్ ఏసీపీ స్రవంతి రాయ్ ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇటీవల వరుస ద్విచక్ర వాహనాల చోరీ కేసులపై నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ సూచనలతో ఏసీపీ స్రవంతి రాయ్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పురం సీఐ ఎస్.వి.వి. లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక గాలింపు చేపట్టారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చోరీలకు పాల్పడింది పశ్చిమగోదావరి జిల్లా, పెరవలి మండలంలోని అజ్జారం గ్రామానికి చెందిన పల్లంగి సుబ్బరాజుగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు. విచారణలో అతను ఇచ్చిన సమాచారం మేరకు వేర్వేరు ప్రాంతాలలో ఉన్న అతను చోరీలు చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



మాడు పగులుతోంది!

ఎండలు ముదురుతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపడం మొదలు పెడుతున్నాడు. రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ప్రభావం చూపుతున్నప్పటికీ మధ్యాహ్నం వేళల్లో సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. దీంతో ప్రజలు బయటకొచ్చేటప్పుడు రక్షణగా గొడుగులు, స్కార్ఫ్‌లు వినియోగిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డు వద్ద కనిపించిన దృశ్యాలను మీరు చిత్రాల్లో చూడొచ్చు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





రోబోటిక్స్‌లో విస్తృత అవకాశాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోబోటిక్స్ ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని స్మార్ట్ హోమ్స్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం రోబోటిక్స్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. రోబోట్ల రూపకల్పన, నిర్మాణం, ప్రోగ్రామింగ్, నిర్వహణ అంశాల్లో ప్రాథమిక అవగాహన కలిగించడం, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, సృజనాత్మకతను పెంపొందించడం ప్రధానాంశాలుగా వర్క్‌షాపులో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యవక్తగా హాజరైన ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రోబోటిక్స్ అధ్యయనం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ప్రాబ్లమ్-సాల్వింగ్ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం రంగాల్లో అవగాహన పెంచుతుందన్నారు. రోబోటిక్స్ ద్వారా ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో రోబోట్స్ ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, పరిశ్రమలు, స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ రంగాలతో పాటు రోజువారీ జీవనంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు మాట్లాడుతూ నావిగేషన్, పాత్ ప్లానింగ్ సాంకేతికత, ఫుడ్ డెలివరీ రోబోట్స్, సాంకేతికత తదితర ప్రాయోగిక ప్రాజెక్టుల గురించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎం.ఆర్.ఉదయ్‌కుమార్ కార్యశాల లక్ష్యాలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ బాలిక అదృశ్యమైన ఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట రాయన చిట్టిబాబు సెంటర్‌కు చెందిన దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కుమార్తె(17) 9వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. ఈనెల 26వ తేదీ ఉదయం తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో రాజకీయ దుర్గంధం

- ఆలయంలో రెగ్యులర్ ఈవో లేక అదుపు తప్పుతున్న పాలన
- పాలకమండలిలో నేరచరిత్ర లేనివారిని నియమించాలి
- వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై గల శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (దుర్గగుడి)లో రాజకీయ దుర్గంధం పెరిగిపోయిందని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ఆరోపించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో నిర్వహించారు. ఆలయంలో రెగ్యులర్ ఈవో లేకపోవటంతో పాలన అదుపు తప్పుతోందన్నారు. ఆలయంలో ప్రస్తుత ఇన్‌చార్జి ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌గా, కమిషనర్‌గా మూడు బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. దానివలన ఆలయంలో సమయం కేటాయించలేకపోతున్నారన్నారు. ఆలయానికి శాశ్వత ఈవోను ఐఏఎస్ క్యాడర్ కలిగిన వారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆలయ పాలక మండలి నియామకంలో కూటమి ప్రభుత్వం నేర చరిత్ర లేనటువంటి వారిని మాత్రమే నియామకం చేయాలన్నారు. రౌడీషీటర్లను, మాజీ రౌడీ షీటర్లను, భూకబ్జాదారులను పాలకమండళ్లలో నియమించవద్దన్నారు. అమ్మవారి ఆలయంలో కాంట్రాక్టు నిర్వహిస్తున్న అన్య మతస్తులను వెంటనే తొలగించాలన్నారు. రెగ్యులర్ ఈవో లేనందువలన పర్యవేక్షణ కొరవడిందని ఉద్యోగస్తులు కొంతమంది ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. అన్నదానం కాంట్రాక్ట్ పూర్తయి మూడు నెలలైనా నేటి వరకు టెండర్లు పిలవలేదన్నారు. భక్తులు అల్పాహారం చేయాలంటే అమ్మవారి ఆలయంలో క్యాంటీన్ లేదని, రాష్ట్రంలో అతిపెద్ద దేవాలయంలో కనీసం క్యాంటీన్ నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆరోపించారు. కాశీనాయన సత్రం కూల్చివేతపై పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో అద్దూరి తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ రాయితీకి విశేష స్పందన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు నగరవాసులు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీకి విశేష స్పందన వచ్చిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.10.50 కోట్లు పన్ను బకాయిలను వసూలు చేశారని ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని మార్చి 31 లోపు తమ ఆస్తిపన్ను ఖాళీ స్థలాల పన్ను బకాయిలు చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని తెలిపారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం నగర పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తాయని, వీటితోపాటు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న 286 సచివాలయాల్లో కూడా పన్నులు వసూలు చేస్తారని, ఆయా సచివాలయాలన్నీ ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పన్ను బకాయిలు చెల్లించటానికి క్యాష్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ముస్లింలపై చంద్రబాబు మొసలి కన్నీరు

జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్

వించిపేట(విజయవాడపశ్చిమ): ఒక పక్క కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇస్తూ మరో పక్క నగరంలో జరిగిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలపై ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించి రంజాన్ తోఫా పేరుతో పప్పు, బెల్లంతో మోసం చేశారని ఆరోపించారు. ఇప్పుడు మైనారిటీల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోక పోగా, మరింతగా మైనారిటీలకు అన్యాయం చేస్తూ వక్ఫ్ సవరణ బిల్లుకు చంద్రబాబు మద్దతు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ముస్లింల కోసం సాధించిన గన్నవరం ఎంబార్కేషన్ పాయింట్‌ను కూడా రద్దు చేయించారని, దీనిపై ముస్లిం మైనారిటీలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ శారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లింలకు జరిగిన మేలును, మొన్నటి అయిదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా జరిగిన మేలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఒట్టిమాటలు కట్టిపెట్టి నిజాయితీగా ముస్లిం మైనారిటీల కోసం పని చేయాలని టీడీపీ ప్రభుత్వానికి హితవు పలికారు.